# మంచి రోజులు వస్తాయా?

(క థా ని క)

"ఎక్కడికి పోయినా యిదే వెధవ సంత! యింత దుర్భరంగా ఏడుస్తుందని మొదట్లోనే తెలిస్తే, ఈ గోతిలో దిగేవాణ్ణే కాదు" అనుకుంటూ గదిలోకి వెళ్ళి, కోటూ, చొక్కా విప్పి స్టాండుకు తగిలిస్తున్నాడు గ్రాడ్యుయేట్ నారాయణరావు.

చంటిపిల్ల, యింటి పెంకు లెగిరిపోయేలా గుక్క పెట్టి ఏడుస్తోంది. శారద ఏంచేస్తోందో తెలీదు. "పొద్దస్తమానం ఏమో మహా పని వెలగబెడుతున్నట్టు ఎప్పుడూ పిల్లను ఏడిపిస్తూంటుంది. యింట్లోనైనా సంతోషంగా, కాలం గడుపుదామంటే, వీల్లేదు గదా!" అనుకుంటున్నాడు నారాయణరావు.

ఇంతలో శారద రుసరుసలాడుతూ, "ఇదేం చోద్యమోనమ్మా! యింటి గడపెక్కినవారు పిల్లలా గుక్కపట్టి ఏడుస్తోంటే, కాస్త ఎత్తుకుని బుజ్జగించరాదూ! అన్నీ నేనే ఏడ్చుకోవాలాయె" అని సణుక్కుంటోంది.

నారాయణరావుకు, వళ్ళు తారామండలం దాకా మండి పోతోంది భార్యామణి మాటలకు. కాని ఏంచేస్తాడు? గృహిణీమణి ఆగ్రహానికి గురికావల్సొస్తుందని మారు మాట్లాడకుండా పడకకుర్చీ వసారాలో కీడ్చుకొని, ఆనాటి దినపత్రిక చదువుకుంటున్నాడు కాస్త మనశ్శాంతి దొరుకుతుందేమోనని.

* * *

"యింక భోజనానికి లేవొచ్చు. మళ్ళా పిల్ల లేస్తే, ఏపనీ చేసుకోనీదు. అన్నాలు తిన్నాక అంతపనీ చేసుకోవాలి. మీ మాదిరిగా, ఎప్పుడూ కుర్చీలు విరిగేలా కూచుంటే, నాకెలా సాగుతుంది?" అంది గుక్క తిప్పుకోకుండా ఇందాకటి రోషాన్నంతా ఒక్కసారి కక్కుతూ.

నారాయణరావు పిల్లిలా, ప్రత్యుత్తర మివ్వకుండా దొడ్లోకి వెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కొని వంటింట్లో విస్తరిముందు కూచున్నాడు, కనీసం "ఏం చేశావు అన్నంలోకి" అనైనా అడక్కుండా.

శారద బెండకాయ కూరొడ్డించింది. అందులో ఎలా పడ్డయ్యో ఏమో, బొగ్గు పలుకులు వచ్చాయి. కాని నారాయణరావు, 'మౌనేన కలహం నాస్తి' అన్నట్లు, ఓర్పు వహించి ఊరుకున్నాడు. కాని మనసులో ఆఫీసు విషయాలూ ఇంటి గొడవలూ ఒక్కసారి గిర్రున బుర్రలో తిరిగాయి.

యింటికొస్తే అర్ధాంగి అనాదరణ, ఆఫీసులో అధికార్ల అదలింపు, బైట బాకీదార్ల బాధ. సర్వకాల సర్వావస్థలయందు, ఏదో చింతతోనే "కాలండరు" కాగితాలు చినుగుతూంటే మానవుడు ఎంతకాలం జీవించ గలుగుతాడు? బైటున్న కష్టాలలా వుండగా భార్యకూడా ఒక భరించరాని బాధగా తయారై కూచుంటే? వచ్చేజీతం డెబ్భైరూపాయిల్లోనూ, ఇరవైరూపాయిలు యింటివాళ్ళ ముఖాన కొట్టాలి, ఒకరోజు ఆలస్యమైందా, "కాబూలీ"వాడిలా పట్టుకుంటారు ఈ పట్నవాసం యింటి యజమాన్లు. యీజబ్బు ఇక్కడున్న అరవవాళ్ళకే కాకుండా, అక్కడినుంచి వచ్చి (ఆంధ్ర) ఇక్కడ యిల్లూ వాకిలీ సంపాదించిన "పదహారణాల" ఆంధ్రులు కూడా ఈనాడు "పదిహేనణాల" అరవల మనుకుంటూ దయారహితులై ప్రవర్తిస్తారు. పైగా ఇంతింతద్దెలు కాజేస్తూ, "అక్కడుమ్మేశావు, ఇక్కడుమ్మేశావు. నాల్గుబిందెలు కొళాయి నీళ్ళెక్కువ పట్టుకున్నావు" మొదలైన సణుగుడు. ఇంతింత మొత్తాలు గుంజుకుంటున్నాం గదా. కొంచెం చూసీ చూడనట్టు పోదామన్న మానవత్వమే మృగ్యం. మిగతా ఏభైరూపాయిల్లోనూ ముగ్గురూ కాలం గడపాలి. ఏది కొనబోయినా మండిపోతోంది. ఇందులోనే

శ్రీనివాస కాశ్యప

అడ్డా గోచీ, చుట్టం, పక్కం, అన్నీ ఒరోగాలతో సహా సరి దిద్దుకోవాలి. ఇల్లాలు యిల్లు చక్క బెట్టడంలో పొదుపరి గాదు. ఉన్నంతవరకు "తట్ట తగలేసుకు" తింటామనే రకం. తెచ్చి నవి నెలకు సరిపోతాయి గదా అని తను తెస్తే పదిహేనో తారీక్కి ఖాళీచేసి, అదిలేదు ఇది లేదు, అని సిద్ధం. ఇలా దుర్భరజీవితం గడు పుతూ ఇటు అత్తవారికీ, అటు కన్నవారికీ పెట్టలేదన్న నిందను యెలా భరించడం."

పులుసు పొయ్యనా? అన్న భార్య కేకకు ఆలోచనా సముద్రంలో మునిగి తేలుతున్న నారాయణరావు ఉలిక్కిపడ్డాడు. వెంటనే స్వాప్నిక జగత్తునుండి యథార్థజగతిలో అడుగు పెట్టాడు. భార్య పులుసు పోస్తోంది. అందులో కూడా బొగ్గులు రెండు వచ్చాయి. దాంతో క్రోధావేశచిత్తుడై,

"ఆడవాళ్ళకి మన్షి విజ్ఞప్తి చేశాడు లే, సోమవారం అన్నం తినగూడదనీ గడ్డి గాదం తినాలనీ. దాన్ని నువ్వు "అక్షరాలా" పాటి స్తున్నట్లున్నదే" అన్నాడు.

ఇంకేం రెండు రైలింజన్లు గుద్దుకున్నంత గోలైంది భార్యాభర్తల మధ్య.

అపూటకు యేవో నాలుగు మెతుకులు తిని కడుపులో సెగలు పొగలుగా మండుతున్న కోపాగ్నిని అణుచుకుంటూపోయి వరండాలో మంచంమీద పడుకున్నాడు. ఈరభస మూలాన చంటిది కాస్తా నిద్ర లేచింది. ఇహ దాన్ని వూరుకోబెట్టేటప్పటికి ముప్పై ఏళ్ళనాడు చచ్చిన తాత లేచొచ్చినంత పనైంది.

* * *

కాలచక్రం ఆకులు కనబడనంత వేగంగా తిరిగిపోతోంది. కాని నారాయణరావు పరిస్థితి ఇంటా బయటా కూడా ఒకేలా వుంది. ఆఫీసులో యెంత విరగబడి చచ్చినా, యింటికి సైతం తెచ్చి పనిచేసినా, అఘాయిత్యంగా అరిచి, దబాయించేవాళ్ళదే పైచేయిగా వుంది గాని, నారాయణరావు 'చాకిరీ' రాణింపుకు రావడం లేదు. ఇంటి విషయాల్లో భార్య సాధించి పోస్తుంది. అప్పులవాళ్ళా పీడించుకు తింటున్నారు. ఈ బాధంతా పడలేక, ఏ గోతిలోనన్నా దూకుదామనుకునేంత కష్టంగా తయారయిందతని జీవయాత్ర.

ఒకనాడు వంట్లో బాగున్లేదు. శలవు కావా లంటే బొత్తిగా వీల్లేదన్నాడు యజమాని. ఈ ప్రయివేటాఫీసుల యజమాన్లింతే. అలాగే సాయంత్రందాకా ఉద్యోగం ఊరేగించి ఇల్లు చేరుకున్నాడు.

ఇంటికొచ్చే వేళకి "బాయిలర్లా" మసిలి పోతోంది వళ్ళంతా. ఎక్కడివ కాలక్కడ లాక్కుపోతున్నాయి. వెధవ ఉద్యోగం మానేస్తామనుకున్నాడు. వెంటనే లక్ష కొశ్చెన్ మార్కులు యెదురొక్కన్నాయి నారాయణ రావును రిజర్వు పోలీసుల్లా.

"మానేసి ఎక్కడికి పోను? ఏం చెయ్యను? భార్యనీ పిల్లనీ ఏం చెయ్యను? ప్రతి నెలా వచ్చే డెబ్భై రూపాయిలూ చాలకుండా 'నానా గడ్డీ' కరుస్తుంటే, అసలు ఉద్యోగమే లేక యెలా జీవిస్తాను యీ పట్నంలో?" మొదలైన ప్రశ్నలన్నీ నారాయణరావు బుర్రలో తాచు పాములా బుసలుకొడుతున్నాయి. ఆలోచన తీవ్రమైన కొలదీ, జ్వరం 'తారాపథా' న్నందుకొంది. మూడు నాలుగు రోజులు మూసిన కన్ను తెరవకుండా పడిపోయాడు నారాయణ రావు.

* * *

పదిహేను రోజులకి మళ్లీ మనిషై ఆఫీసుకి వెళ్ళాడు. ఈలోపలే "పేరు కొట్టేస్తాం; తగు చర్యలు జరుపుతాం" అనే నోటీసులు ఆఫీసునుంచి రాకపోలేదు. కాని, ఏంచేస్తాడు? ఆఫీసుకు వెళ్ళిన్నాడు డిపార్టుమెంట్ హెడ్డు చేత తొంభైనాలుగూ పడి, ఉద్యోగం కాస్తా వూడకుండా అతికించుకునే సరికి, కలియుగం మారి కృతయుగం ప్రారంభమైనంత పనైంది. అంతకంటే నిర్లక్ష్యంగా వ్యవహరించేవాళ్లూ, పనిచేయకుండా ఎగగొట్టేవాళ్ళూ, పై అధికార్లను వలలో వేసుకుని వారిదగ్గర యితర్లను గురించి సత్యదూరములైన పలుకులు పలికేవాళ్లూ వార ప్రతిభను గురించి ఉపన్యాసా[illegible]చే వాళ్ళూ ఉన్నా, దురదృష్టవంతుడైన నారాయణరావే నలుమూలలా, అపరాధ పరిశోధకుడికి చిక్కిన దొంగలా అధికార్లకు కనబడే వాడు. యజమాని [illegible], కోత

గల భాగ్యశాలులు నారాయణరావులాటి అమాయకులను తొక్కిపెట్టడం ఏం వింత? అసలు తెలివిగల అధికారుల్ని సైతం బుట్టదాఖల్ చేసే మహామేధావులున్నారు నారాయణరావు ఆఫీసులో. ఇంక నారాయణరావు సంగతి చెప్పాలా! వాళ్ళ వృత్తే అది. దాని మూలానే వాళ్ళు "ఇయర్లీ యింక్రిమెంట్లు" సంపాదించి ధనాఢ్యుల్లో చేరిపోతున్నారు.

కష్టాలతోపాటు ఖర్చులూ ఖర్చులతోపాటు అప్పులూ, పెరిగిపోతున్నాయి నారాయణరావు జీవితంలో. ఎన్ని విధాలో ఆలోచించేడు ఈ ఆర్థిక సమస్యను పరిష్కరించటానికి. ఆఖరికి భార్యా పిల్లను పుట్టింటికి పంపాలని నిర్ణయానికొచ్చాడు. అదీ ఒక విధంగా అపరిష్కృతంగానే కనబడింది. ఎందుచేతనంటే, భార్య యిక్కడినుండి వెళ్ళాలంటే, నెల జీతం ఖర్చు కావాలి. అదుంటే యిక్కడే ఉండొచ్చుగా! పోనీ అక్కడ మాత్రం ఎన్నాళ్లు వుంటుంది? వాళ్ళు మాత్రం ఎన్నిదినాలు పెట్టగలరు? ఎటు చూచినా ప్రశ్నార్థకాలే.

ఎలా అయితేనేం, భార్యను వూరికి పంపడానికి నిర్ధారించుకుని పంపేశాడు. కాని, తిట్లో తుమ్మో ఆ పడేసే మెతుకులు కాస్తా పోయినయ్. హోటల్లో రేషన్ మెతుకులు చాలక అవస్థ పడుతున్నాడు. ఒక సమస్య వదిలితే రెండోది ఎదుర్కొంటోంది నారాయణరావును. "లొంగేవాణ్ణి చూస్తే వంగదియ్యబుద్ధవుతుందని" నారాయణరావు మీద అధికార్లు ప్రతి విషయానికీ కారాలు మిరియాలు నూరుతున్నారు. తుమ్మితే వూడే ముక్కులా వుంది ఉద్యోగం.

* * *

ఆనాడాఫీసుకు వెళ్లడం ఆలస్యమయింది. వెళ్లగానే ముట్టజెప్పదల్చుకున్నవన్నీ ముట్టజెప్పారు అధికార్లు. సాయంకాలం నాల్గింటికి టెలిగ్రామ్! ఏమని? చంటి బిడ్డకు సీరియస్‌గా వుంది రమ్మని. చేతిలో కానీ లేదు. రైలు చార్జీలకే కావాలి పాతిక! ఎక్కణ్ణించి తేవడం? బుర్రలో విమానాలు తిరుగుతున్నట్టనిపించింది నారాయణరావుకు. బిక్కమొహం పెట్టుకొని ప్రొప్రయిటరును కలుసుకున్నాడు అడ్వాన్సుకోసం. సవాలక్ష చదివి ఇరవై రూపాయిలు చేతిలో పెట్టాడు హడావుడిగా పోయి మెయిలెక్కి మర్నాటికి అత్తవారూరు చేరుకున్నాడు నారాయణరావు.

ఇల్లు చేరేవరకు చావుబ్రతుకుల్లో వుంది చంటిపిల్ల. వైద్యలోపం లేకుండా చేస్తున్నారు. నారాయణరావు దురదృష్టం యిందులోగూడా జొరబడకుండా, భగవంతుడు కాస్త చల్లగా చూచాడు. చంటిది క్రమేణా తేరుకుంటోంది. ఇంక ఫర్వాలేదు పోదామనుకుంటున్నాడు అప్పటికి నెలైందని. సాయంకాలం ప్రయాణం. మూడుగంటలకు శనిగాడు "నిన్నొదుల్తానా" అని వెనకాలబడ్డట్టు సైకిల్ లో పోస్టు జవాన్ వెనకాల తరుముకుంటూ వచ్చి ఒక రిజిస్టర్ వుత్తరం ఇచ్చిపోయాడు.

అది ఉద్యోగోద్వాసన. ఇంక మద్రాసు వెళ్ళాల్సిన పనిలేదు నారాయణరావుకు. పోనీ కష్టకాలంలో వున్నాను, నన్ను మన్నించి ఉద్యోగం యివ్వండని అడగడానికి మళ్ళా మద్రాసు బయల్దేరాడు.

మొండి ధైర్యంతో వచ్చి, కాళ్ళా వేళ్ళా పడ్డాడు. ఫలితం చివాట్లే-కనీసం, తీసేసినవాడి కివ్వాల్సినది గూడా యెగనామమే. నోరులేనివాడు కోర్టుకు మాత్రమేం పోతాడు? చట్టాలన్నీ కాగితాల్లోనే వున్న ఈరోజుల్లో అంతే. నెత్తిన చెంగేసుకుని, "చచ్చేంత జబ్బు చేసిన పిల్ల బ్రతికిందే చాలు - వెధవ ఉద్యోగం పోతే పోయింది" అనుకుని మళ్ళీ రైలెక్కాడు నారాయణరావు.

—:O:—

సంతోషమయమైన జీవితం! బ్రతికివున్న మానవుడెవడూ దాన్ని భరించలేడు. అంతకంటె నరకం ఇంకొకటుండదు ప్రపంచంలో. — బెర్నార్డ్‌షా.